క్లుప్తంగా

సీఎం రేవంత్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ధన్వాడ: భారతీయ సంస్కృతిలో గోవులకున్న ప్రాధాన్యత గుర్తిస్తూ గో సంరక్షణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని హిందు వాహిని స్వాగతిస్తుందని హిందూ వాహిని నారాయణపేట జిల్లా సంయోజక్ సుదర్శన్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గో సంతతిని కాపాడేందుకు వెనకాడేది లేదని గో సంరక్షణకు ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ వేయడం గొప్ప విషయమన్నారు. మహారాష్ట్ర, యూపీ, ఉత్తరాఖండ్ తదితర ప్రభుత్వాలు అవలంభిస్తున్న గో సంరక్షణ విధానాలను అధ్యయనం చేయాని కోరారు.

యోగా డేను విజయవంతం చేద్దాం

నారాయణపేట రూరల్ : ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక అభినందన్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న యోగా డేను విజయవంతం చేయాలని సురేష్, శివకుమార్, శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు సామూహిక యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఎంహెచ్‌వో జయచంద్ర మోహన్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని విద్యాసంస్థల్లో కరపత్రాలు పంపిణీ చేశారు.

సమీకృత కార్యాలయం పనుల పరిశీలన

కొత్తపల్లి: మండల కేంద్రంలో నిర్మాణం చేపట్టిన సమీకృత మండల కార్యాలయం పనులను గురువారం తహసీల్దార్ జయరాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పనుల్లో జాప్యం జరగకుండా కావలసిన ఇసుక, కాంక్రీటు, స్టీల్, సిమెంట్‌ను సమకూర్చుకోవాలని గుత్తేదారులకు సూచించారు. అలాగే నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

'హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత'

మద్దూరు: హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, మాణికేశ మహా సంస్థానం పీఠాధిపతి శంకర్‌స్వామిజీ అన్నారు. గురువారం ధర్మ జాగరణ సమితి, ఆదిజాంబవ పరియోజన-పాలమూర్ విభాగ్ ఆధ్వర్యంలో హిందూ ధర్మం ప్రాముఖ్యతను వివరిస్తూ స్వామిజీ మండలంలోని దమ్‌గాన్‌పూర్, పర్సాపూర్, మద్దూరు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్‌గాన్‌పూర్‌లో ఎస్సీ కాలనీలోని ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు హిందువులు విధిగా చేయాల్సిన పనులను వివరించారు. కార్యక్రమంలో ధర్మ జాగరణ సమితి ప్రతినిధులు విజయ్, భరత్, రఘు, ప్రశాంత్, శంకర్, రఘుపతి పాల్గొన్నారు.

బీజేపీ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

కోస్గి రూరల్:గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించి వారి శ్రేయస్సు కోసం పాటుపడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ప్రతాప్‌రెడ్డి , పున్నం చంద్ లాహోటిలు అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పాలెం ప్రశాంత్ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి సంపల్లి శ్రీనివాస్, నరేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా నారాయణ, లక్ష్మన్, భాస్కర్, దేవప్ప, సెక్రటరీలుగా బెజ్జురఘు, అంజి , కృష్ణ ,మహేందర్, భాస్కర్ , కోశాధికారి తమ్మళి బాల్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు అంజయ్య, కోటకొండ రాము, శ్రీకాంత్ ఉన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

నారాయణపేట ఎడ్యుకేషన్: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యోగా అలాగే దాని విశిష్టతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్ రావ్ మాట్లాడుతూ.. యోగా యొక్క విశిష్టతను అందరూ తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు రోజూ యోగా చేసి తమ ఆరోగ్యాన్ని పదిలబర్చుకోవాలన్నారు. యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.వ్యాస రచన పోటీల అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

నేడు బీజేపీ మండల కార్యకర్తల సమావేశం

కృష్ణా: మండల కేంద్రంలో శుక్రవారం ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాల బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు మజ్జిగ సురేష్, ఉమ్మడి మండల బీజేపీ అధ్యక్షుడు నల్లె నర్సప్ప తెలిపారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్యకర్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మట్టి రోడ్లు.. తప్పని తిప్పలు

- రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో అధ్వానంగా రహదారులు
- సీసీ రోడ్లు వేయాలని కోరుతున్న ప్రజలు



ఐనాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

కృష్ణా: మండలంలోని రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో సరైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చేగుంట రైల్వే స్టేషన్ నుంచి ఐనాపూర్ వరకు ఉన్న లింక్ రోడ్డుతో పాటు సూకూర్ లింగంపల్లి, కుసుమర్తి గ్రామాలు కర్ణాటకలోని పలు గ్రామాలతో అనుసంధానం అయి ఉన్నాయి. ఈ గ్రామాల రోడ్లు మట్టి రోడ్లు కావడంతో వర్షాకాలంలో రాకపోకలకు ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్లపై ద్విచక్రవాహన దారులతో పాటు ఇతర ప్రయాణికులు, పాదాచారులు వెళ్లాలంటే బురద, గుంతలమయమైన రోడ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఈ రోడ్లపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే కర్ణాటక ప్రభుత్వం వారి సరిహద్దుల వరకు బీటీ రోడ్డును నిర్మించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం సరిహద్దు గ్రామాలపై దృష్టి సారించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు. తారు రోడ్లు నిర్మించాలని పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్న వించినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

చేగుంట వాసులకు తప్పని నరకయాతన

కృష్ణా మండలం నుంచి కర్ణాటక సరిహద్దులోని ఐనాపూర్ గ్రామం నుంచి కర్ణాటకలోని బాడియాల్ గ్రామానికి వెళ్లాలంటే చేగుంట బాడియాల్ రోడ్డు, సూకూర్ లింగంపల్లి నుంచి గూడూర్ పై నుంచి వెళ్లాలి. అయితే ఈ గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. పక్క రాష్ట్రమైన కర్ణాటక మాత్రం తమ పరిధిలోని గ్రామాల వరకు బీటీ రోడ్లు నిర్మించింది. కానీ మన ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం నిధుల లేమితో రోడు దుస్థితిని పట్టించుకోకపోవడంతో సరిహద్దు రాష్ట్రాలకు వెళ్లే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఏది ఏమైనా సరిహద్దు గ్రామాల్లో తారు రోడ్డు లేకపోతే సీసీ రోడ్లను వేసి తమ ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుంతలమయంగా రైల్వేస్టేషన్ రోడ్డు



చేగుంట గ్రామ రైల్వే స్టేషన్ ప్రాంతంలోని మట్టి రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారడంతో కనీసం పాదాచారులు కూడ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో ఈ రోడ్డుపై వాహనాలు సైతం వెళ్లకపోవడంతో ప్రాణాలు పోతున్నాయి. కేవలం కిలోమీటర్ ఉన్న ఈ రోడ్డుకు గ్రావెల్ అయిన వేయించి మరమ్మతు చేయిస్తే కొంతలో కొంత మేలు జరుగుతుంది.

–లింగప్ప, చేగుంట గ్రామం

ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం



కర్ణాటకలోని బాడియాల్ గ్రామానికి వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా మార్చడం కోసం నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అలాగే ఈ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన సూకూర్ లింగంపల్లి గ్రామానికి ఉన్న మట్టి రోడ్డు కూడా గత వర్షాకాలంలో దెబ్బతింది. ఈ రోడ్డును కూడా బీటీ రోడ్డుగా మార్చేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభించవచ్చు.

అంజనమ్మ పాటిల్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు

'పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం'



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: బీద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. మండలంలోని పేరపళ్ళ, బొమ్మన్ పాడు గ్రామాలలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు గురువారం ఆయన భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తామని మోసం చేసిందన్నారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ అమలు చేస్తుందని, ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, నర్సింలు గౌడ్, జైపాల్ రెడ్డి, శరణప్ప, ఆనంద్, జనార్దన్, రవి, సీను, రాజు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు గురువారం ఎంపీడీఓ కృష్ణారావ్, పంచాయతీ కార్యదర్శి శ్రీను నాయక్‌తో కలిసి మార్కింగ్ వేశారు. మండల కేంద్రానికి 21 ఇళ్లు మంజూరు కాగా 14 ఇళ్లకు మార్కింగ్ వేసి భూమిపూజలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో మండలంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మండల కేంద్రంలో సమీకృత మండల కార్యాలయ భవన నిర్మాణాలు, ఎస్సీ కాలనీల్లో అండర్ డ్రెయినేజీ నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని మాజీ ఎంపీటీసీ చన్నప్ప తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్

ధన్వాడ: మండల కేంద్రంలోని లబ్ధిదారులకు మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు మార్కింగ్ వేసి ప్లానింగ్ అందజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాఘవేందర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, సూరి, బలరాజు, వెంకట్రాములు, నర్సింములు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక

కోస్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా సరఫరా చేయనున్నట్లు మండల తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు గురువారం ముశ్రీఫా గ్రామంలోని 9 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి మూడు ట్రాక్టర్ల చొప్పున మొత్తం 27 ట్రాక్టర్లకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ముశ్రీఫా వాగులో లబ్ధిదారుల పత్రాలను పరిశీలించాకే ఇసుకను తీసుకెళ్లడానికి అనుమతి ఇవ్వాలన్నారు. లబ్ధిదారులే ట్రాక్టర్ రవాణా ఛార్జీలు, లేబర్ ఛార్జీలు భరించాల్సి ఉంటుందన్నారు.

మహిళలకు అండగా 'షీ టీం'



నారాయణపేట రూరల్: రాష్ట్రంలో మహిళలకు అండగా షీ టీం ఉందని కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో గురువారం ప్రయాణికులకు షీ టీంపై అవగాహన కల్పించారు. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు, బస్టాండ్‌లో ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా, సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వచ్చినా విద్యార్థినులు, యువతులు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల డీపీలతో వాట్సాప్ కాల్ చేసి డబ్బులు పంపమని అడిగితే పంపొద్దని, లాటరీల పేరుతో వచ్చే గుర్తుతెలియని లింకులను ఓపెన్ చేయకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జ్యోతి, కవిత పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



దామరగిద్ద: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గడిమున్కన్‌పల్లిలో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం కల్పించి ఉద్యమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు శివకుమార్, సీపీఎం జిల్లా కార్యవర్గ వర్గ సభ్యుడు గోపాల్, అంజిలయ్యగౌడ్, మహేష్‌కుమార్, అశోక్, బాల్‌రాం పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



తడి-పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

కోస్గి రూరల్: ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి బట్ట సంచులను వాడాలని అలాగే తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా పోతిరెడ్డిపల్లిలో తడి-పొడి చెత్తపై ఇంటింటా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తడి , పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. అలాగే అమృత్‌జల్ పథకం ద్వారా ప్రతి ఇంటికి త్వరలోనే స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌కుమార్ , హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, ప్రసన్నకుమారి , మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది , కార్మికులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో విజయలక్ష్మి

మాగనూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మాగనూర్ ఇన్‌చార్జి ఎంపీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె తళంకేరి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకా రం భోజనం అందించి, నాణ్యత పాటించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్లు ఢీ.. తప్పిన ప్రమాదం



మాగనూర్: మండల కేంద్ర సమీపంలోని మైసమ్మ ఆలయం సమీపంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. హైదరబాద్ నుంచి రాయచూర్ వైపునకు వెళ్తున్న కారు, రాయచూర్ నుంచి మక్తల్ వైపు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వచ్చిన కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాద సమయంలో రెండు కార్లలో ఎయిర్‌బెలూన్స్ తెరుచుకోవడంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అయితే ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని మాగనూర్ ఎస్‌ఐ అశోక్ బాబు పేర్కొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు

దామరగిద్ద: వ్యవసాయంలో సేంద్రియ పద్ధతులను అవలంభించడం వల్ల పెట్టుబడులు తగ్గించుకొని అధిక లాభాలు పొందవచ్చని ఏఈఓ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని లోకూర్తి గ్రామంలో రైతు శ్రీనివాస్ రెడ్డి పొలంలో డబ్ల్యూఓఆర్‌టీ స్వచ్ఛంద సంస్థ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీవామృతం, వేస్ట్ డి కంపోజర్ తయారిపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. జీవామృతం తయారి, పంటలపై ఏ సమయంలో పిచికారీ చేయాలో వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అజయ్ సంస్థ ప్రతినిధి వర్దన్, రైతులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్వ మండల సమగ్ర అభివృద్ధే ధ్యేయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

నర్వ: రాబోయే ఐదేళ్లలో రూ.150 కోట్లతో నర్వ మండల సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మంత్రి హోదాలో ఆయన తొలిసారి నర్వకు విచ్చేయగా కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ముందుగా స్థానిక ఆంజనేయస్వామి, వాల్మీకి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలోనే ఏ ప్రభుత్వం అందించని విధంగా నిరుపేదలకు రూ.5 లక్షలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తుందన్నారు. అలాగే మండలంలో 5.27 ఎకరాల్లో క్రీడా మైదానం, జూనియర్ కళాశాల ఏర్పాటు, గురుకుల పాఠశాలకు సొంత భవనం ఏర్పాటుకు నిధుల మంజూరు, జంగంరెడ్డిపల్లి, ఉందేకోడ్, పాథర్చేడ్, కన్మనూర్ గ్రామాలకు సాగు నీటిని అందించేందుకు రూ.57 కోట్లతో ఎత్తిపోతల పథకానికి సర్వే చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐసెల్ రాష్ట్ర కమిటీ సభ్యులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, నంగిదేవేందర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జడ్పీ సీఈఓ శైలేష్, హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్‌లు మల్లారెడ్డి, రాంకోటి, ఎంపీడీఓలు శ్రీనువాసులు, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన సన్మానం

మక్తల్: మక్తల్ పట్టణంలో తెలంగాణ బీసీ ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని గురువారం ఆయన నివాసంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామంజనేయగౌడ్, కోశాధికారి రంగప్ప, కుమ్మరి రాజు, లింగంగౌడ్, రవికుమార్, అమర్ పాల్గొన్నారు.

మక్తల్‌లో అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయాలి

మక్తల్ పట్టణంలో అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ సబ్ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, భాస్కర్, భగవంతు, భుట్టో, వెంకట్‌రెడ్డి, సంధ్య, హన్మంతు, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎంఈఓ మాధవికు మొక్క అందజేసి సన్మానిస్తున్న మిత్రులు

ఊట్కూరు: ఊట్కూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో 1988–89లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ ఒక చోట ఏకమై ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల ఊట్కూరు ఎంఈఓగా పదవి బాధ్యతలు చేపట్టిన తమ క్లాస్‌మేట్ అయిన మాధవిని పూలమాలలు, శాలువాతో సన్మానించారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్య ప్రకాశ్‌రెడ్డి, అహ్మద్ రఫీ, ప్రతాప్‌రెడ్డి, మహేశ్వరి, జయశ్రీ, రవికుమార్, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, నాయకులు

నారాయణపేట: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే యోధుడని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం పర్ణికా రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్ లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్ ప్రసాద్ గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

దామరగిద్ద: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని కంసాన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని రాహుల్ గాంధీ ప్రధానిగా దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యుజవన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మదుసూదన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, రాంచందర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది

మాగనూర్: వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అఫ్రోజ్ అన్నారు. గురువారం డయేరియా వ్యాధిపై స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో రహ్మతుద్దీన్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి ఎక్కడ కూడా మురుగు, వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం డయేరియా నిర్మూలనపై గోడపత్రిక విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు తప్పని మురుగు కష్టాలు



పెద్దపొర్ల గ్రామ శివారులో మురుగునీటిలో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థినులు

ఊట్కూర్: మండలంలోని పెద్దపొర్ల గ్రామ శివారులో రహదారులపై కల్వర్టు నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామస్తులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. పెద్దపొర్ల-చిన్నపొర్ల గ్రామాల మధ్య ఒక కి.మీ. చెరువు కట్ట ఉంది. చిన్నపొర్ల, మక్తల్ తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు, విద్యార్థులు చెరువు కట్టపై నుంచి వెళ్తుంటారు. అయితే కల్వర్టు లేకపోవడంతో మురుగు నీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో నీరు అధికంగా ప్రవహిస్తే రాకపోకలు నిలిపేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నాయకులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి



వాహన డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్న శివశంకర్

నారాయణపేట: డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎంటీఓ ఆర్ఎస్ఐ శివ శంకర్ సూచించారు. గురువారం ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ఎస్పీ కార్యాలయంలోని ట్రైనింగ్ సెంటర్ జిల్లాలోని పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు పెట్రోలింగ్ వాహనాన్ని నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలని, రాత్రి పెట్రోలింగ్ చేసే సమయంలో తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్ పరిధిలో నేరస్తులపై నిఘా పెట్టాలని సూచించారు. అలాగే ముందస్తు నేరాలు జరగకుండా సైరన్ వేసుకుంటూ పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పోలీసు మోటార్ వాహన డ్రైవర్లు, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.